అరుణాచలం వైపు ఆర్టీసీ అడుగులు

- గిరి ప్రదక్షిణ రోజు ప్రత్యేక బస్సులు
- ప్రత్యేక ప్యాకేజీ కింద నిర్వహణ
- మార్గమధ్యలో గోల్డెన్ టెంపుల్ ఉచిత దర్శనం
- ప్రయాణికుల నుంచి విశేష స్పందన
- ఒక బస్సుతో ప్రారంభం.. నేడు ఐదు బస్సులు ఫుల్



అరుణాచలం బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) అరుణాచలం వైపు అడుగులు వేస్తోంది. ఆదాయ మార్గాన్ని అన్వేషిస్తున్న సంస్థ తొలుత దూర ప్రాంత పుణ్య క్షేత్రాల వైపు దృష్టి పెట్టింది. అందులో భాగంగా తమిళనాడు రాష్ట్రంలోని ప్రముఖ ఆలయ క్షేత్రం అరుణాచలానికి బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టింది. ఈ మార్గాన నడుపుతున్న బస్సులకు ప్రయాణికుల నుంచి స్పందన లభించడంతో సేవలను విస్తరింపజేస్తోంది. ప్యాకేజీ కింద నడుపుతున్న ఈ ప్రత్యేక బస్సులో రానుపోను చార్జీలతో పాటు ఆలయ క్షేత్రాల దర్శనం కూడా ఉచితంగా చేయిస్తున్నారు. గత ఏడాది నవంబరు నుంచి ప్రారంభించి ప్రస్తుతం ఐదు బస్సులు సిద్ధం చేశారు.

గిరి ప్రదక్షిణ దీపోత్సవం రోజున బస్సులు

అరుణాచలం క్షేత్రంలో ప్రతి నెలా గిరి ప్రదక్షిణ దీపోత్సవం జరుగుతోంది. ఆ రోజు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని గ్రహించిన అధికారులు కర్నూలు నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు శ్రీకారం చుట్టారు. దీపోత్సవానికి ముందు రోజు బస్సు కర్నూలు నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయాన్నే కర్నూలుకు చేరుకుంటుంది. ఆ రోజు గిరి ప్రదక్షిణ, దీపోత్సవం, అరుణాచలేశ్వర స్వామి దర్శనం అనంతరం సాయంత్రం అక్కడి నుంచి బయలుదేని మరుసటి రోజు కర్నూలుకు అదే బస్సులో ప్రయాణికులను తీసుకొస్తారు. మరికొన్ని బస్సులు ఉదయాన్నే బయలుదేరి సాయంత్రానికి చేరుకుంటాయి.

ప్రత్యేక ప్యాకేజీ కింద బస్సులు

అరుణాచల క్షేత్రం దర్శనం ప్రత్యేక ప్యాకేజీ కింద బస్సులు నడపుతున్నారు. ముందుగా సూపర్ లగ్జరీ బస్సులు ప్రవేశపెట్టిన అధికారులు క్రమంగా ఇంద్ర ఏసీ సర్వీసులను పరిచయం చేశారు. కర్నూలు కొత్త బస్టాండ్ నుంచి బస్సులు బయలుదేరినప్పటి నుంచి తిరిగి కర్నూలుకు వచ్చే వరకు బస్సు ప్రయాణికులతోనే ఉంటుంది. వెళ్లేటప్పుడు, తిరుగు ప్రయాణంలో చిత్తూరు జిల్లా కాణిపాకం, వేలూరు స్వర్ణదేవాలయ అమ్మవారి దర్శనం కోసం అవకాశం కల్పిస్తారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో వెళ్లి వచ్చేందుకు చార్జీ రూ.2 వేలు కాగా ఇంద్ర ఏసీ బస్సుల్లో రూ.2,500 ఉంటుంది. ఇందులో ముందస్తు టిక్కెట్లు తీసుకునేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. బస్టాండ్లు, ఏజెంట్లు, ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందవచ్చు. గతంలో కర్నూలు–1, 2 డిపోల నుంచి మాత్రమే బస్సులు నడిపిన అధికారులు ఈ నెల 4న ఆదోని, ఎమ్మిగనూరు నుంచి కూడా ఒక్కో బస్సు చొప్పున నడపనున్నారు.

బస్సులు, ఆదాయ వివరాలు

నవంబరు 6న మూడు బస్సులు నడిపిన ఆర్టీసీకి రూ.1,78,710, 11న రూ.70,805, 13న రూ.37,400, 20న రూ.63,140, జనవరి 5న రూ.65,727, 7న రూ.70,250, ఫిబ్రవరి 4న రూ.71,280, మార్చి 5న రూ.71,280, ఏప్రిల్ 6న ఇంద్ర ఏసీ బస్సుకు రూ.92,541, సూపర్ లగ్జరీ బస్సులకు రూ.1,27,816 కలిపి మొత్తం రూ.8,48,949 ఆదాయం వచ్చింది. ప్రయాణికుల విన్నపం, గిరి ప్రదక్షిణ, దీపోత్సవాన్ని దృష్టిలో పెట్టుకొని ఈనెల 4న గురువారం ఉదయం 6, 7 గంటలకు, సాయంత్రం 5, 5:30 గంటలకు, 8 గంటలకు బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేశారు.

దైవ దర్శనానికి సమస్య ఉండదు



తమిళనాడులో ఉన్న అరుణాచలం దర్శనం కోసం వెళ్లేందుకు ఇబ్బందులు ఉంటాయి. కానీ ఆర్టీసీ నేరుగా ఇక్కటి నుంచి బస్సులు నడపడంతో సమస్య ఉండదు. ఇప్పటికే మేము వెళ్లి వచ్చాం. ప్యాకేజీ కింద కాణిపాకం, ఏలూరు స్వర్ణ దేవాలయం చూపించారు.

– పి.సుధారెడ్డి, కర్నూలు

టికెట్లు ఆన్‌లైన్‌లోనే పొందొచ్చు



అరుణాచలం వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక ప్యాకేజీ బస్సులు నడుపుతున్నాం. 4న మా డిపోతో పాటు కర్నూలు–1, ఎమ్మిగనూరు, ఆదోని డిపోల నుంచి మొత్తం ఐదు బస్సులు తిప్పేందుకు ఆన్‌లైన్‌లో ఉంచారు. ప్రయాణికులు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవచ్చు. లేదా సెల్ 99592 25794, 73828 71131, 77027 74358 నంబర్లు లేదా సమీపంలోని డిపో మేనేజర్లను సంప్రదించవచ్చు.

– సర్దార్ హుసేన్, కర్నూలు–2 డిపో మేనేజర్

నేటి నుంచి విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు విద్యుత్ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీ.క్యాంప్ సెక్షన్ పరిధిలోని గణేష్ నగర్, మద్దూర్ నగర్, సి.క్యాంప్, రెవెన్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, సాయి వైభవ్ నగర్, నంద్యాల చెక్ పోస్టు, శేషాద్రీ నగర్, బృందావన్ నగర్, మారుతీ నగర్, అరుంధతీ నగర్, పాతబస్తీ సెక్షన్ పరిధిలోని జొహరాపురం, ఇందిరమ్మ గృహాలు, పాతబస్తీ, జొహరాపురం హౌసింగ్ బోర్డు, కర్నూలు రూరల్స్ సెక్షన్ పరిధిలోని మిలిటరీ కాలనీ, గార్గేయపురం, దిగువపాడు, శివరాంపురం తదితర గ్రామాల్లో ఉదయం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. అత్యవసరం ఉన్న చోట ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామని, సాధ్యం కాని పక్షంలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు సిటీ: నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా బుధవారం జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం అందజేశారు.

క్లుప్తంగా

చిన్నారులకు టీకా తప్పనిసరి


చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులకు, చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన రోజా వీధిలోని యూపీహెచ్‌సీ–1ను సందర్శించారు. అక్కడ నిల్వ ఉన్న శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారులకు ఇచ్చిన టీకాల వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి, ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం రోజా వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఐరన్ మాత్రల పంపిణీ కార్యక్రమంపై ఆరా తీశారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎన్ఆర్‌సీకి పంపించాలని సూచించారు. ఆయన వెంట యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫాతిమా ఉన్నారు.

మెరుగైన సేవలు అందించండి


రికార్డులు పరిశీలిస్తున్న డివిజనల్ అధికారి బాలక్రిష్టారెడ్డి

కర్నూలు (టౌన్): సచివాలయాల్లో మెరుగైన సేవలు అందించాలని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి బాలక్రిష్టా రెడ్డి సూచించారు. బుధవారం నగరపాలక సంస్థ పరిధిలోని 72, 73, 74 సచివాలయాలను తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ఆధార్ కార్డు లేని 5 ఏళ్లలోపు పిల్లలకు కొత్తగా ఆధార్ కార్డు మంజూరు చేయాలన్నారు. ఫీవర్ సర్వే వివరాలు తెలుసుకొని స్థిర అభివృద్ధి ద్ది లక్ష్యాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు అవగాహన కల్పించాలన్నారు.

మాజీ మంత్రిపై దాడి హేయమైన చర్య

కర్నూలు(అర్బన్): మాజీ మంత్రి, ఎమ్మెల్యే శంకర్‌నారాయణపై సోమందేపల్లి మండలం ఆదుల బళ్లాపురం సర్పంచ్ నాగభూషణరెడ్డి దాడి చేయడం హేయమైన చర్య అని జిల్లా కురువ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కే కిష్టన్న, అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ కురువలు ఉన్నత పదవుల్లో ఉండటాన్ని అగ్రవర్ణాలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. దాడికి పాల్పడిన సర్పంచు, ఇతరులను కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో కోశాధికారి కేసీ నాగన్న, నగర అధ్యక్ష, కార్యదర్శులు తవుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అరుణాచలం వెళ్లే యాత్రికులకు సన్మానం

కర్నూలు(రాజ్‌విహార్): తమిళనాడులోని అరుణాచలం ఆలయ సందర్శన కోసం వెళ్లే యాత్రికులను గురువారం సన్మానించనున్నట్లు ఆర్టీసీ కర్నూలు–1డిపో అసిస్టెంట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రికుల్లో ఉత్సాహం, ప్రయాణికుల్లో ఆసక్తి నింపేందుకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు.

చురుగ్గా పైపులైన్ పనులు



కర్నూలు (టౌన్): నగర పాలక ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో హైవే ఇంటర్నేషనల్ హోటల్ సమీపంలో 500 ఎంఎం పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులు మంగళవారం రాత్రి నుంచి చురుగ్గా సాగుతున్నాయి. అబ్బాస్ నగర్ ఏరియా పరిధిలోని కాలనీలకు నీటి సరఫరా నిలిపివేసి ఈ పనులు చేస్తున్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా బుధవారం ఉదయం నాటికి పనులు పూర్తి చేసినట్లు నగరపాలక డీఈఈ రవిప్రకాష్‌నాయుడు తెలిపారు. యథావిధిగా నీటి సరఫరాను పునరుద్ధరించామన్నారు.

రక్తహీనత ఉన్న వారిని గుర్తించండి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలికలను గుర్తించి తగిన చికిత్స ఇవ్వాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య సూచించారు. బుధవారం ఆయన వీకర్‌సెక్షన్ కాలనీలో ఉన్న యూపీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణిలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, వివరాలను అనీమియా మానటరింగ్ టూల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రక్తహీనత ఉన్న వారికి తగిన చికిత్సలు అందించాలన్నారు. ఎన్‌సీడీ సర్వేలో భాగంగా ప్రతి ఏఎన్ఎం రోజుకు ఐదు హెల్త్ ఐడీలు జనరేట్ చేయాలని, ప్రతి బుధవారం, శనివారం గర్భిణులు, 16 ఏళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా ఇవ్వడమే గాక ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి, వాటిని ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గర్భిణికి ప్రమాదకరమైన చిహ్నాలు గుర్తించినట్లయితే వారిని సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రికి కాన్పు తేదీకి మూడు రోజుల ముందుగానే రెఫర్ చేయాలన్నారు. అనంతరం ఆయన ఏఎన్ఎం యాప్, రికార్డులు, రిపోర్టులు పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు. ఆయన వెంట యూపీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీరాములు ఉన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకించండి


రాస్తారోకో నిర్వహిస్తున్న ట్రేడ్ యూనియన్ల నాయకులు

కర్నూలు(అర్బన్): తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలకు చెందిన ట్రేడ్ యూనియన్ల నేతలు కోరారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి నాగన్న నాయకత్వంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 32 మంది ఆత్మ బలిదానంతో ఏర్పడిన విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలని కోరారు. కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ సంఘీభావం తెలిపారు. ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రామాంజనేయులు, సీఐటీయూ న్యూసిటీ కార్యదర్శి సాయిబాబా, రైతు సంఘం జిల్లా కార్యదర్శులు రామకృష్ణ, జగన్నాథం, నాయకులు రామాంజనేయులు, మనోహర్ మాణిక్యం, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం


క్యాంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): స్థానిక వీకర్‌సెక్షన్ కాలనీలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా చేయకుండా ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి పీవీ రమణ మార్కెట్ యార్డు డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, డీవీఎంసీ సభ్యులు ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఘనంగా జాబ్ అచీవర్స్ డే వేడుకలు


ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం జాబ్ అచీవర్స్ డే వేడుకలు నిర్వహించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సబీహా పర్వీన్ పాల్గొని ఉద్యోగాలు పొందిన పాలిటెక్నిక్ విద్యార్థులకు నియమాక పత్రాలు అందజేశారు. అనంతరం కాలేజీలో డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ


పెసరవాయికి చెందిన రాధాకృష్ణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ శ్రీనివాసులు


సి.బెళగల్ మండలం ముడుమాల గ్రామానికి చెందిన పెద్ద కృష్ణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సోమప్ప

పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. మొదటి రెండు రోజుల్లో గ్రామాల్లో ఉన్న పెన్షనర్లకు పింఛన్ పంపిణీ చేసిన వలంటీర్లు మూడోరోజు అందుబాటులో లేని, వివిధ ప్రాంతాల్లో చికిత్స కోసం వెళ్లిన వారిపై దృష్టి సారించారు. వారున్న చోటికే వెళ్లి పింఛన్ ఇచ్చి వచ్చారు.

- కల్లూరు: మండలంలో పెద్దటేకూరు గ్రామ సచివాలయానికి చెందిన పింఛన్ గొందిపర్ల లక్ష్మీదేవి అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వలంటీర్ మహేశ్వరి అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశారు.
- గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామానికి చెందిన రాధాకృష్ణ కర్నూలులో చికిత్స పొందుతుండగా అక్కడికి వెళ్లి వలంటీర్ శ్రీనివాసులు పింఛన్ సొమ్ము అందజేశారు.
- సి.బెళగల్: మండల పరిధిలోని ముడుమాల గ్రామానికి చెందిన బారికి నారాయణ పక్షవాతానికి హైదరాబాద్ వైద్యం చేయించుకుంటున్నాడు. వలంటీర్ రాజ్‌కుమార్ అక్కడికి వెళ్లి పింఛన్ డబ్బు అందజేశారు. అదే గ్రామానికి చెందిన పెద్ద కృష్ణ అనారోగ్యంతో కర్నూలులో బంధువుల ఇంట్లో ఉంటూ చికిత్స పొందుతుండటంతో వలంటీర్ సోమప్ప అక్కడికి వెళ్లి పింఛన్ నగదు అందజేశారు.

అభివృద్ధి పనులకు రేపు శంకుస్థాపన

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని పలు వార్డుల్లో రూ.3.44 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఈనెల 5న శంకుస్థాపన చేయనున్నట్లు మేయర్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొంటున్నట్లు పేర్కొంది.

ముగిసిన టెక్ ఎక్స్‌ప్లోర్

కర్నూలు సిటీ: స్థానిక జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలో టెక్నికల్ ఫెస్ట్‌లో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించిన టెక్ ఎక్స్‌ప్లోర్ కార్యక్రమం బుధవారం స్పోర్ట్స్, కల్చరల్ డే కార్యక్రమాలతో ముగిసింది. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వై పాండురంగయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈ శ్రీనివాసరావు, కన్వీనర్ ఆచార్య శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ అధికారుల నియామకం

కర్నూలు (టౌన్): ప్రతి వారం స్పందనతో పాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పర్యవేక్షణ అధికారులను నియమించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టేందుకు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, నగరపాలక మేనేజర్ చిన్నరాముడు, డీపీఓ ఉమేష్‌లను పర్యవేక్షణ అధికారులుగా నియమించారు.

1,400 విత్తన శాంపిల్స్ సేకరణ

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 సంవత్సరానికి సంబంధించి 1,400 విత్తన శ్యాంపిల్స్ సేకరించాలని యంత్రాంగానికి వ్యవసాయ శాఖ లక్ష్యాన్ని ఇచ్చింది. ఖరీఫ్, రబీల్లో నెల వారిగా విత్తనాల శ్యాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లకు పంపాల్సి ఉంది. ల్యాబ్‌ల్లో విత్తనాల నాణ్యతా ప్రమాణాలను పరీక్షిస్తారు. నాణ్యత లేదని నిర్ధారణ అయితే ఆ విత్తనాల లాట్‌పై నిషేధం విధించడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటారు.

98 డీఎస్సీ టీచర్స్ అసోసియేషన్ ఏర్పాటు

కర్నూలు సిటీ: నగరంలోని ఓ కాలేజీలో బుధవారం 98 డీఎస్సీ టీచర్స్ సమావేశమై అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, గౌరవ సలహాదారులుగా పురుషోత్తం, జిల్లా ఉపాధ్యక్షులుగా రాయలవారి ఆదిశేషు, చింతలపల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఖాసీంవలి, కోశాధికారిగా పి.సోమసుందరశాస్త్రీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు సంయుక్త కార్యదర్శులుగా దానమయ్య, సయ్యద్ అక్బర్, కార్యవర్గ సభ్యులు నాగరాజు గౌడ్, నాగప్రసాద్, తిమ్మారెడ్డి, యాసీన్, వరస్వామి, కరీముల్లా, కృష్ణారెడ్డిలను ఎన్నుకున్నారు.

కరాటే సంఘం జిల్లా కార్యదర్శిగా షకీల్


షకీల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): జిల్లా కరాటే సంఘం నూతన కార్యదర్శిగా కేఎండీ షకీల్ ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం హాలులో ఏర్పాటు చేసిన కరాటే సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా షకీల్ మాట్లాడుతూ కరాటే క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన కార్యదర్శిని సన్మానించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోలా ప్రతాప్ పాల్గొన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన ఇన్‌చార్జ్ కలెక్టర్


స్టేట్ క్యాన్సర్ యూనిట్ వద్ద పనుల గురించి ఆరా తీస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(హాస్పిటల్): జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య బుధవారం సాయంత్రం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను సందర్శించారు. గురువారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పర్యటించనున్న నేపథ్యంలో ఆమె ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రేడియో డయాగ్నోస్టిక్ సెంటర్, పీజీ ఉమెన్స్ హాస్టల్ పనుల గురించి ఆరా తీశారు. అనంతరం మంత్రి పర్యటనకు సంబంధించి రూట్‌మ్యాప్‌పై వివరాలు తెలుసుకున్నారు. స్టేట్ క్యాన్సర్ యూనిట్ భవనం, మాస్టర్ ప్లాన్ పనులను, ఎంసీహెచ్ భవనాన్ని తనిఖీ చేశారు. ఆమె వెంట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయిసుధీర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని ఉన్నారు.

మాజీ ప్రిన్సిపాల్‌పై విచారణ

కర్నూలు సిటీ: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కళావతిని బుధవారం విద్యాశాఖ అధికారులు విచారించారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ పురుషుల డిగ్రీ, సిల్వర్‌జూబ్లీ, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలను 2021లో ప్రభుత్వం క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోకి చేర్చింది. ఆ మూడు కాలేజీల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని వర్సిటీ అధికారులకు అప్పగించకుండా ప్రిన్సిపాల్ ఉన్నత విద్యాశాఖకు సరెండర్ చేశారు. ఆ తరువాత కొద్ది రోజులకే నెల్లూరు జిల్లా రాపూర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేస్తూ డిగ్రీ కాలేజీల కడప ఆర్జేడీ ఎఫ్ఏసీ బాధ్యతలు కూడా అప్పగించారు. అయితే రాపూర్ ప్రిన్సిపాల్ ఆమె బాధ్యతలు తీసుకోలేదు. దీంతో పాటు మరికొన్ని అంశాలపై విచారించాల్సిందిగా రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సి.క్రిష్ణ ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఆయన బుధవారం పురుషుల డిగ్రీ కాలేజీకి చేరుకుని టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కాలేజీల ప్రిన్సిపాళ్లను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆయన తెలిపారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఈఓ శామ్యూల్ పాల్

కర్నూలు సిటీ: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జ్ డీఈఓ శామ్యూల్ పాల్ హెచ్చరించారు. బుధవారం డీఈఓ చాబర్‌లో విద్యాశాఖ అంశాలపై మండల విద్యాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం, ఫోలిక్ ట్యాబ్లెట్ల నమోదుతో పాటు వివిధ అత్యవసర పనుల్లో సీఆర్పీలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో జిల్లా వెనుకబడి ఉందనే అపనింద ఉందని, దీన్ని తొలగిపోయేలా చూడాలన్నారు. పని తీరు మెరుగుపరుచుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సరెండర్

కర్నూలు (టౌన్): విధి నిర్వహణలో ఫిర్యాదులు రావడంతో నగర పాలక టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్) రాధాకృష్ణను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. స్థానికంగా 4వ వార్డులో భవన నిర్మాణాల అనుమతుల విషయంలో అవినీతి ఆరోపణలు రావడంతో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ టీపీఎస్‌ను టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ లేఖ రాశారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్

కర్నూలు (న్యూటౌన్): స్పందన కార్యక్రమంలో వచ్చే వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ సి హరిప్రసాద్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం జెడ్పీలోని సమావేశ భవనంలో కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, కల్లూరు మండల అధికారులు, కార్యాలయ ఉద్యోగులు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది రైతులు వివిధ సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, వారి సమస్యను పరిష్కరిస్తే ఎంతో సంతోషిస్తారని అన్నారు. స్పందనలో వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. సమావేశంలో ఆర్డీఓ ఆఫీస్ ఏఓ వేణుగోపాల్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ విజయశ్రీ, కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు, కల్లూరు తహసీల్దార్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్


సోషల్ ఆడిట్ చేపట్టిన టీమ్ సభ్యులు

కర్నూలు (న్యూటౌన్): 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై బుధవారం జెడ్పీలోని కర్నూలు మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు సోషల్ ఆడిట్ చేపట్టారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ టి.రవికుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వైఎస్సార్‌హెల్త్ క్లినిక్ నిర్మాణాలకు సంబంధించిన పనులపై 18 బృందాలు ఆడిట్ చేస్తున్నాయన్నారు. 10 రోజుల పాటు రికార్డులు పరిశీలించి, అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి పనుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకోండి

కర్నూలు (న్యూటౌన్): ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ విజయ సూచించారు. బుధవారం ఆమె దిన్నెదేవరపాడు గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జాకీర్‌హుస్సేన్ ఉన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : పొన్నియిన్ సెల్వన్–2 ఏజెంట్,విరుపాక్ష ,సిసు,ఇవిల్‌డెడ్ రైజ్ శాకుంతలం
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : పొన్నియిన్ సెల్వన్–2 ,ఇవిల్‌డెడ్ రైజ్,దసరా విరుపాక్ష ,ఏజెంట్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ఏజెంట్, విరుపాక్ష ,
ఐనాక్స్ : ఇవిల్‌డెడ్ రైజ్, సిసు కిసీ కా భాయ్ కిసీ కా జాన్ పొన్నియిన్ సెల్వన్–2,సుజుమె
భరత్ కాంప్లెక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, ఇవిల్‌డెడ్ రైజ్, దసరా
శ్రీరామ: ఏజెంట్
రాజ్ : పొన్నియిన్ సెల్వన్–2
విజయ : విరుపాక్ష